క్లుప్తంగా

యూపీహెచ్‌సీలో సేవలు పునరుద్ధరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): వరద ముంపునకు గురైన అజిత్‌సింగ్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సేవలు పునరుద్ధరించారు. దీంతో అక్కడ అందుతున్న సేవలను గురువారం ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని పరిశీలించారు. ఓపీ రోగులకు చికిత్స, రక్తపరీక్షలు, మందులు అందుబాటు వంటివి తనిఖీ చేశారు. అంతేకాక ఆ కేంద్రం పరిధిలోని నందమూరినగర్‌లో జరుగుతున్న ఫీవర్ సర్వేను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్ఓ డీపీఎం డాక్టర్ నవీన్, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యేసోబు, మలేరియా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితం నాశనం



భవానీపురం(విజయవాడపశ్చిమ): నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మత్తు పదార్థాల వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం మాదక ద్రవ్యాల నియంత్రణ ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసే మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా రూపుమాపటంలో వారు భాగస్వాములు కావాలని సూచించారు. నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ కె. ప్రియాంక మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం క్షీణించడంతోపాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతారని అన్నారు. మరో కో ఆర్డినేటర్ ఎస్. జాకబ్ రాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలైన బాలలు, యువతను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ చికిత్స అందించేందుకు నవజీవన్ బాల భవన్ సంస్థ నూజివీడు రోడ్‌లో బోస్కో డీ ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందని చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ వెంకటేశ్వరరావు, కె విశాలాక్షి, పి. రాజ్య వరలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలకు అనన్య



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి లాంగ్ టెన్నిస్ పోటీలకు గొల్లపూడిలోని కేపే అకాడమీలో శిక్షణ పొందుతున్న శ్రవణం అనన్య ఎంపికయ్యింది. ఇటీవల ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ నిర్వహించిన వివిధ క్రీడా జట్ల ఎంపికలో భాగంగా లాంగ్ టెన్నిస్ పోటీలకుగాను ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి అండర్ 14 కేటగిరీలో ఎంపిక చేసిన జట్టుకు ఎన్టీఆర్ జిల్లా నుంచి అనన్య ఎంపికయ్యింది. వచ్చే నెలలో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి లాంగ్ టెన్నిస్ పోటీలో ఈ జట్టు పాల్గొననుంది. అట్కిన్‌సన్ (గొల్లపూడి) హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతూ టెన్నిస్‌లో శిక్షణ తీసుకుంటున్న చిన్నారి శ్రవణం అనన్య స్టేట్ లెవెల్ పోటీల్లో పాల్గొనే జట్టులో ఒకరిగా ఎంపిక కావడం అభినందనీయమని కేపే అకాడమీ కోచ్ ఎస్‌కే నాగూర్‌వలీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వరద బాధితుల నమోదులో గందరగోళం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితుల వివరాలు నమోదులో గందరగోళం నెలకొందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు అన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయం అనేక మందికి అందని పరిస్థితి నెలకొందన్నారు. గురువారం అజిత్‌సింగ్‌నగర్, సుందరయ్య నగర్, న్యూ రాజరాజేశ్వరి పేట, వాంబే కాలనీ ప్రాంతాల్లో బాబూరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల వద్ద పెద్ద ఎత్తున బాధితులు అధికారులను నిలదీస్తున్నారని, వారి నుంచి సరైన సమాధానం రావడం లేదన్నారు. ప్రజల ఫిర్యాదులను స్వీకరించే నాథుడే కరువయ్యాడన్నారు. చిరువ్యాపారులు భారీగా దెబ్బతిన్నారని, వారి వివరాలు అసలు నమోదు చేయలేదన్నారు. జాబితాల్లో లోపాలు సరిదిద్ది, బాధితులందరికీ న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు బి. రమణరావు, శివ, నిర్మల, శ్రీను, పీరు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం హై జంప్!

- బుడమేరు వరద ముంపు బాధితుల నష్ట గణనలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం
- రూ.25 వేలకు బదులు రూ.10 వేలే నష్టపరిహారం
- వందలమంది బాధితుల వివరాలే లేవు
- జక్కంపూడి వైఎస్సార్ కాలనీ బాధితుల ఆవేదన

నష్టం గ్రౌండ్ ఫ్లోర్లో.. నమోదు మాత్రం ఫస్ట్ ఫ్లోరే



వరద నీటిలో మునిగిన వైఎస్సార్ కాలనీ(ఫైల్)

భవానీపురం(విజయవాడపశ్చిమ): పీక లోతు వరద నీళ్లల్లో గ్రౌండ్ ఫ్లోర్స్ అన్నీ మునిగి సర్వం కోల్పోతే నో డామేజ్.. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండి నష్టపోతే మరో బ్లాకులో ఫస్ట్ ఫ్లోర్‌లో ఉన్నట్లు రాయడం.. ఇంటికొచ్చిన అధికారులకు ఆధార్ నంబర్ ఒకటిస్తే వేరే ఆధార్ నంబర్ చూపెడుతుండటం.. చివరికి ఎన్యూమరేషన్ సమయంలో రాసిచ్చిన అర్జీలు చెత్త బుట్టల్లో దర్శనం.. వెరసి విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని బుడమేరు వరద బాధితుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రభుత్వం అందించిన సాయం అర్హులకు అందకుండా పోయింది.

పొంతన లేదు..

వరద బాధితులకు నష్టపరిహారం ఇస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనలకు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న దానికి పొంతన ఉండటం లేదు. స్థానికేతర ఉద్యోగులను పిలిపించుకుని ఎన్యూమరేషన్ చేయించిన ప్రభుత్వం, వారు చేసిన తప్పిదాలకు బాధ్యత వహించాల్సి ఉండగా వైఎస్సార్ కాలనీ బాధితులు లబోదిబో అంటూ గగ్గోలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. సచివాలయానికి వెళ్తే ఇంటి దగ్గర ఉండండి వస్తామంటారు. గంటల తరబడి ఇంట్లోనే ఉన్నా అడ్రస్ ఉండరు. ఫస్ట్ ఫ్లోర్‌లో ఉన్న వారి ద్విచక్రవాహనాలకు రూ.3వేలు ఖాతాలో పడితే గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటూ పూర్తిగా నష్టపోయిన వారికి రూపాయి కూడా పడలేదు. అతి కొద్ది మంది బాధితులకు మాత్రమే నామమాత్రంగా డీబీటీ ద్వారా ఖాతాల్లో వేసి చేతులు దులుపుకున్న ప్రభుత్వం.. అర్హుల ఖాతాల్లో వేయలేదని స్పష్టం అవుతోంది. కాగా కాలనీలోని అనేక బ్లాక్‌ల్లోగల గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండి నష్టపోయిన బాధితులు ఇప్పటికైనా ప్రతి ఇంటికి వచ్చి నష్టపోయిందీ లేనిదీ స్వయంగా చూసుకుని నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

తారుమారు చేశారు..



వైఎస్సార్ కాలనీ 113వ బ్లాక్‌లో గ్రౌండ్ ఫోర్-8లో ఉంటున్నాం. పది అడుగుల మేర వచ్చిన వరదకు మునిగిపోయి సర్వం పోగొట్టుకున్నాం. ఎన్యూమరేషన్ చేసి వెళ్లారు. ఇప్పుడు చూస్తే 117 బ్లాక్‌లో ఎఫ్ఎఫ్2లో ఉన్నట్లు వచ్చింది. పోనీ ఆ డబ్బులన్నా వచ్చాయా అంటే రాలేదు. అద్దెకు ఉండే వాళ్లం ఒక చోటే ఉండం.. మరో బ్లాక్‌కు మారుతుంటాం. కానీ మ్యాపింగ్ ఎలా ఉంటే అలానే వస్తుందని చెప్పటం న్యాయమా?

– పాలపర్తి కొండమ్మ

న్యాయం చేయాలి..



వరదకు ముందు రోజు ఇంట్లో వంట చేస్తుండగా ఫిట్స్ వచ్చి పొయ్యిమీదపడి ఒళ్లు కాలిపోయింది. అర్ధరాత్రి బుడమేరు వరద వచ్చి ముంచేసింది. హాస్పిటల్‌కు వెళదాంటే పీకల్లోతు నీళ్లల్లో బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. చంటి బిడ్డతో ఆకలితో అల్లాడుతున్న మాకు తాగేందుకు నీళ్లు దొరకలేదు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదు. లారీ డ్రైవర్‌గా పని చేసే మా ఆయన బాలయ్యకు పని లేకుండా పోయింది. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కూడా అంద లేదు.

– అడపాక బాలమ్మ,

మురుగు సమస్యకు పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తులు మురుగుతో ఎదురైన సమస్యకు అలయ అధికారులు పరిష్కారం చూపారు. 'మురుగు నీటిలోనే భక్తుల నడక' శీర్షికతో సాక్షి దిన పత్రిక ప్రచురించిన కథనానికి దుర్గగుడి అధికారులు స్పందించారు. గురువారం ఉదయం మహామండపం ఎదుట పొంగిన డ్రెయినేజీని మరమ్మతులు నిర్వహించడంతో పాటు మ్యాన్‌హోల్స్‌పై ఉంచిన నిర్మాణ సామగ్రిని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఉదయమే డ్రెయినేజీలో అడ్డుకున్న చెత్తను తొలగించడమే కాకుండా దసరా ఉత్సవాలలో ఈ సమస్య మళ్లీ తిరిగి రాకుండా మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేయించేందుకు ప్రత్యేకంగా శానిటేషన్ సిబ్బందిని నియమించడంతో పాటు మ్యాన్‌హోల్స్‌పై ఐరన్ రాడ్స్, సెంట్రింగ్ సామగ్రిని క్రేన్‌ల సాయంతో తరలించారు.



మ్యాన్‌హోల్స్ వద్ద ఉంచిన ఐరన్‌ను క్రేన్‌ల సాయంతో తొలగింపు

క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి



మాట్లాడుతున్న డాక్టర్ నారాయణరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు అన్నారు. ఎస్‌జీఎస్ అండర్ 19 బాల బాలికల హ్యాండ్‌బాల్, చెస్ సెలక్షన్స్ కేబీఎన్ కళాశాల ఆవరణలో గురువారం జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభకు డాక్టర్ నారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అండర్-19 వయస్సు కలిగిన వారందరూ క్రీడల్లో మంచి ఉత్సాహాన్ని ప్రదర్శించాలన్నారు. తద్వారా రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. చెస్‌కు అంతర్జాతీయ ర్యాంకర్ పి. జ్యోతికిరణ్ ఆర్బిట్‌గా వ్యవహరించగా, హ్యాండ్‌బాల్‌కు కళాశాల క్రీడా విభాగాధిపతి డి హేమచంద్రరావు ఆధ్వర్యంలో సెలక్షన్స్ కొనసాగాయి. రెండు విభాగాల్లో ఎంపికైన విద్యార్థులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయిలో స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటారని వివరించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ కె. నారాయణరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇవ్వాలి



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని పతకాలు తెచ్చే విధంగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని, అందుకు తగు చర్యలు తీసుకోవాలని స్పోర్ట్స్ సిబ్బందిని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో తన చాంబర్లో వీఎంసీ స్పోర్ట్స్ సిబ్బందితో కమిషనర్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. నగర పరిధిలో ఉన్న అన్ని స్పోర్ట్స్ స్టేడియంలు, జిమ్ములు, స్విమ్మింగ్ పూల్స్‌లో విద్యార్థులకు, ప్రజలకు అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ వచ్చేలా శిక్షణ ఇచ్చేందుకు కావాల్సిన అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడా ప్రాంగణాల్లో ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని ఆదేశించారు. స్పోర్ట్స్ సిబ్బంది నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ టి.శ్రీనివాస్, సూపరింటెండింగ్ ఇంజినీర్లు రామ్మోహన్, శ్రీరామచంద్రమూర్తి, కార్పొరేషన్ పరిధిలోని అన్ని జిమ్‌ల కోచ్‌లు, స్విమ్మింగ్ కోచ్‌లు, స్టేడియం ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

కార్మికవాడ అభ్యున్నతికి కృషిచేస్తా

ఏటీపీ నూతన అధ్యక్షుడు రాజనాల



ఆటోనగర్(విజయవాడతూర్పు): కార్మికవాడ అభివృద్ధితో పాటు కార్మికుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని ఆటోమొబైల్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు అన్నారు. స్థానిక ఏటీపీ హాలులో ఏటీపీ నూతన అధ్యక్షుడు, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఏటీపీకు వరుసగా నాల్గోసారి అధ్యక్షుడిగా రాజనాల ఎన్నిక కావడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ఆటోనగర్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులను రాబట్టి కార్మికవాడ సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. త్వరలో తాగునీటి సమస్యను పరిష్కరించడంతోపాటు రహదారుల అభివృద్ధి జరగాలన్నారు. అంతకుముందు ఏటీపీ అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు, కార్యదర్శి రావి రామచంద్రారావు, కోశాధికారిగా సయ్యద్ షా సాహెబ్ హుస్సేన్ (బాబా), ఉపాధ్యక్షులుగా అర్జా సత్యనారాయణ, మిగిలిన కార్యవర్గంతో ఎన్నికల అధికారి బాయన వెంకట్రావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్, ఐలా మాజీ పాలకవర్గ సభ్యులు ఎస్.దుర్గాప్రసాద్, అన్నే శివ నాగేశ్వరరావు, కలాం బ్యాటరీ వర్క్స్ అధినేత డాక్టర్ అబ్దుల్ కలాం, శ్రీనివాసరెడ్డి, దొనె శ్రీనివాసరావు, నెల్లి వెంకటేశ్వరరావు, ఎండీ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో శాంతి హోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురువారం శాంతి హోమం నిర్వహించారు. కొండపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆలయ అర్చకులు యాగాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఆలయ ఈవో రామరావు దంపతులు హోమంలో పాల్గొన్నారు. పూర్ణాహుతి నిర్వహించిన అనంతరం ఈవో రామరావు దంపతులకు వేద ఆశీర్వచనం అందించారు.

గాంధీహిల్‌పై స్వచ్ఛతా హీ సేవ



గాంధీహిల్‌పై పిచ్చిమొక్కలను తొలగిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు



300 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


పటమట(విజయవాడతూర్పు): నగర పేరు ప్రఖ్యాతులు పెరగాలంటే చారిత్రక ప్రాంతాల్లో స్వచ్ఛత ఎంతో ముఖ్యమని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గాంధీ హిల్‌పై కమిషనర్, అధికారులు, విద్యార్థులు పిచ్చి మొక్కలు, వ్యర్థాలను శ్రమదానంతో తొలగించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే వీఎంసీ ఆధ్వర్యంలో నగరంలోని చారిత్రక ప్రదేశాలైన గాంధీ హిల్, మొగల్రాజపురం గుహల వద్ద వ్యర్థాలను శ్రమదానం ద్వారా శుభ్రం చేశామన్నారు. ప్రజలు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. స్వచ్ఛ విజయవాడ కేవలం ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమన్నారు. అందుకు ప్రజల నుంచి సహకారం అందుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం బుర్రకథ ద్వారా స్వచ్ఛతను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగానే సర్కిల్-3 పరిధిలోని మొగల్రాజపురం గుహలు, పరిసరాలను వీఎంసీ సిబ్బంది శుభ్రం చేశారు.

జాతీయ జెండాతో ర్యాలీ..

ఈ సందర్భంగా సర్కిల్-1, 2 పరిధిలోని కళాశాలలు, పాఠశాల విద్యార్థులు 300 అడుగుల పొడవైన జాతీయ జెండాతో గాంధీహిల్ దిగువ నుంచి పైకి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొండపై ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, రెడ్యూస్ రీ యూజ్ రీసైకిల్, స్వచ్ఛభారత్ నినాదాలతో అక్కడున్న ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ బాబు శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, సర్కిల్-1 కార్పొరేషన్ సిబ్బంది, గాంధీజీ మునిసిపల్ హై స్కూల్, పాదుర్తి సుందరమ్మ హై స్కూల్, వించిపేట ఉర్దూ హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు దేవాలయాల్లో పూజలు నిర్వహించాలి

వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ రాజ్



బందెల కిరణ్ రాజ్

భవానీపురం(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని దేవాలయాల్లో పూజలు నిర్వహించాలన్న మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈ నెల 28న పార్టీకి చెందిన దివ్యాంగులంతా అందుబాటులో ఉన్న ఆలయాల్లో పూజలు నిర్వహించాలని పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. కేవలం నీచ రాజకీయ ప్రయోజనాల కోసమే సీఎం చంద్రబాబు తిరుమల పవిత్రత, స్వామివారి లడ్డూ ప్రసాదం విశిష్టత, టీటీడీ పేరు ప్రఖ్యాతులకు అపకీర్తి తీసుకువచ్చారని పేర్కొన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో ఉపయోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని అసత్య ప్రచారం చేస్తూ కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని అన్నారు. సనాతన ధర్మం గురించి డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు నాటి మనువాదం గుర్తుకు వస్తుందని పేర్కొన్నారు. ప్రజల్లో కుల, మతాలను రెచ్చగొట్టే విధంగా ఉన్న పవన్ కల్యాణ్ ప్రవచనాలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు.

వరద బాధితులను ఆదుకోవటంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబు కూటమి ప్రభుత్వం మాటలే తప్ప చేతల ప్రభుత్వం కాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోతిన మహేష్ అనారు. గురువారం ఆయన మీడియాకు ఓ పత్రిక ప్రకటనను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బెజవాడలో బుడమేరు ముంపు బాధితులను ఆదుకోవడంలో, నష్టపరిహారం చెల్లించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. విజయవాడను ముంచింది బుడమేరు కాదని, చంద్రబాబు ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్య వైఖరి ముందుచూపు లోపించడమే కారణమన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రూ.6,800 కోట్లు నష్టపోయి ప్రజలు కష్టాలతో కాపురం చేస్తున్నారన్నారు. కానీ కూటమి ప్రభుత్వ సాయం అందిస్తున్నది కేవలం రూ. 202 కోట్లే అని పేర్కొన్నారు. మానవత్వంతో దాతలు రూ.400 కోట్ల రూపాయలు విరాళాలుగా ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం చేసిన తప్పునకు ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రజలు నష్టపోతున్నది రూ.6,200 కోట్లు అన్నారు. విజయవాడ నగరంలో బుడమేరు ముంపునకు 2.32 లక్షల కుటుంబాలు గురయ్యాయన్నారు. అందులో కేవలం 78 వేల కుటుంబాలకు మాత్రమే పరిహారాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. మిగిలిన 1,54,000 కుటుంబాలను గాలికి వదిలేశారా? అని ప్రశ్నించారు.

కుమ్మరిపాలెంపై కక్ష ఎందుకు?

అర్హత లేకపోయినా ఆందోళన చేస్తున్నారని విజయవాడ పశ్చిమ నియోజకవర్గం కుమ్మరిపాలెం ప్రజలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడటం దుర్మార్గమన్నారు. బాధితులు వేరే ప్రాంతాలకు తరలి వెళ్లినప్పుడు, పునరావాస కేంద్రాల్లో ఉన్న సమయాల్లో హడావుడిగా ఎన్యూమరేషన్ చేశారన్నారు. బాధితుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు గాని, ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదన్నారు.

దసరా సాంస్కృతికోత్సవాలు ప్రారంభం



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు



ప్రసంగిస్తున్న ఉన్నత విద్యాశాఖ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరిదేవి

కృష్ణలంక(విజయవాడతూర్పు): యువతీ యువకుల్లో సృజనాత్మకతను, సమాజంపై అవగాహన పెంచేందుకు దసరా సాంస్కృతికోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఏపీ ఉన్నత విద్యాశాఖ వైస్ చైర్మన్ పి.ఉమామహేశ్వరిదేవి అన్నారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న దసరా సాంస్కృతికోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఉమామహేశ్వరిదేవి పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శాస్త్రీయ, జానపద, వెస్ట్రన్ డ్యాన్సులు, అభ్యుదయ, దేశభక్తి, జానపద పాటల పోటీలలో యువతీ యువకులు పాల్గొని ప్రతిభ కనబరిచారు.



అవాక్కయ్యే ఆకృతులు

ఇంద్రగిరికి కడియం మొక్కల సోయగం

దసరా ఉత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని పలు ప్రాంతాల్లో కడియం నుంచి తీసుకొచ్చిన వివిధ ఆకృతుల్లోని మొక్కలను ఏర్పాటు చేయాలని దేవస్థానం నిర్ణయించింది. ఇప్పటికే కొన్ని మొక్కలను ఇంద్రకీలాద్రికి తరలించగా, మరికొన్ని మొక్కలు ఒకటి రెండు రోజులలో ఆలయానికి చేరనున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఓంకారం, శివలింగాకృతి, జంట నెమళ్లు, జిరాఫీలు, ఈఫిల్ టవర్, తలపై కడవతో వస్తున్న మహిళాకృతిలో ఈ మొక్కలను తీర్చిదిద్దారు. అమ్మవారి ఆలయ పరిసరాలతో పాటు మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఈ మొక్కలను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ మొక్కల సంరక్షణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. - ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)